ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (కోడవల్లిలో శ్రీనాన్నగారి ప్రవచనము, 21-6-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనలోఉన్న దుర్వాసనలను ఖండిస్తూ ఆచార్యులవారు దుర్వాసనప్రతీకారదశకం అని కొన్ని శ్లోకాలు వ్రాసారు. మనలోఉన్న దుర్వాసనలనుబట్టి మనకు రాబోయే జన్మలు ఆధారపడి ఉంటాయి. గురువును, శాస్త్రాన్ని, భగవంతుడు చెప్పే మాటలను ఆశ్రయించి దుర్వాసనలను తొలగించుకోమని చెపుతూ కొన్ని ఉపదేశ మాటలను ఆచార్యులవారు చెప్పారు. పదిమందిని బాగుచేయాలనే కోరిక మనకు ఉన్నంతమాత్రంచేత సరిపోదు. వారిని బాగుచేసే శక్తికూడా మనకు ఉండాలి. అది ఈశ్వరుడు మనకు ఇస్తే వస్తుందిగాని బలవంతంచేసి తెచ్చుకునేది కాదు. జ్ఞానం అనేది ఈశ్వరుడియొక్క అనుగ్రహంవలన వస్తుంది. పరమేశ్వరునియందు ప్రీతి, ప్రేమ, భక్తి లేకపోతే మనకు ఆయన అనుగ్రహం కలుగదు. అనుగ్రహం కలుగకపోతే జ్ఞానంకూడా కలుగదు.

కర్మఫలాన్ని ఏరూపంలోనూకూడా నువ్వు ఆశించకూడదు. కర్మఫలాన్ని త్యాగంచేయాలి. కర్మఫలాన్ని దృష్టిలోపెట్టుకోకుండా నీవు పనిచేస్తే దేవుని అనుగ్రహానికి పాత్రుడవుతావు. అప్పుడు మోక్షసుఖాన్ని పొందుతావు. కోరికలు నెరవేరినపుడు నీకు సుఖం వస్తుంది. అప్పుడు వచ్చే సుఖాన్ని మోక్షసుఖంతో పోలిస్తే అది లక్షోవంతుకూడా ఉండదు. నీకు అంచనాకోసం చెపుతున్నాను. అలాగని మోక్షసుఖంగురించి ఊహించవద్దు. ఊహించుకొంటూ ఉంటే ఆ ఊహలే మన మార్గానికి అడ్డువస్తాయి. లోకం మీ డబ్బును, అధికారాన్ని, గౌరవాన్ని చూస్తుంది. కాని మీ హృదయంలో ఏమి ఉంది అని భగవంతుడు చూస్తాడు. నీవు కాశీలోఉన్న దేవుని, రామేశ్వరంలోఉన్న దేవుని చూడటానికి వెళుతున్నావు. నీ హృదయంలోఉన్న దేవుడిని చూడటానికి ప్రయత్నంచేయటంలేదు అంటున్నారు ఆచార్యులవారు. Know God in your heart అంటున్నారు ఆచార్యులవారు. నీ హృదయంలోఉన్న ఆత్మను ఎప్పుడైతే తెలుసుకొన్నావో అప్పుడు లోకంకూడా నీకు ఆత్మగా కనిపిస్తుంది. అప్పుడు మరణాన్ని జయిస్తావు.

కాలమును సద్వినియోగంచేసుకోండి. రోజులు బాగానే వెళ్ళిపోతున్నాయి అనుకొంటున్నావుగాని చావు దగ్గరకు వస్తోంది అని నీకు తెలియటంలేదు. ఎండకి ఎండిపోకుండా, వర్షానికి ఏమీ తడవకుండా మీ శరీరాన్ని ఎంత జాగ్రత్తగా చూసుకొన్నా అది ఏదోఒకరోజు బూడిదఅవుతుంది. ఇది మర్చిపోకండి అని ఆచార్యులవారు హెచ్చరిక చేస్తున్నారు. అజ్ఞానానికి కారణాలు ఏమిటో తెలుసుకొని ఆ కారణాలను తొలగించుకొంటే అజ్ఞానము తగ్గుతుంది. అజ్ఞానమును తొలగించుకోవటానికి ఎవరూ ప్రయత్నం చేయటంలేదు కారణం ఏమిటి అంటే దానివలన వచ్చే అపాయం, బాధలు వారికి తెలియటంలేదు. నీలోఉన్న మాయతోటి, దోషాలతోటి పోరాడాలంటే నీబుద్ధి స్థిరపడాలి, మనస్సు పవిత్రం అవ్వాలి. నీ మనస్సును పవిత్రంచేసుకోవటానికి కాలమును సద్వినియోగంచేసుకో. భగవంతుడు కాలస్వరూపములో ఉన్నాడు. కాలమును పాడుచేసుకొంటే భగవంతుని అగౌరవపరచినట్లు అవుతుంది. భగవంతుని మాటయందు మనకు గౌరవము లేకపోతే ఆమాటను ప్రాక్టీసుచేయటానికి మనం ప్రయత్నంచేయలేము. పూర్వజన్మలో మనం ఫలితాన్ని ఆశించి పనిచేసాము. ఆ ఫలితాన్ని అనుభవించటంవలన దానికి సంబంధించిన ముద్రలు మన మనస్సులో పడిపోయాయి. ఆ ముద్రలలోనుండి బయటపడితేనేగాని మన మొఖం జ్ఞానంవైపుకు తిరగదు. ఆ ముద్రలను, దోషాలను తొలగించుకోవటానికి నీవు ప్రయత్నంచేయాలి. ఆ దోషాలు ఉంటే భగవంతుడు నీ

హృదయంలో ఉన్నప్పటికి లేదని నీకు అనిపిస్తుంది. భగవంతుడు నీ హృదయంలో ఉన్నాడు. నీవు మాట్లాడే మాటలను, నీవుచేసే పనులను నీ ఆలోచనలను చూస్తున్నాడు అన్నసంగతి మర్చిపోవద్దు అంటున్నారు ఆచార్యులవారు. ఈశ్వరుడు మనహృదయంలో ఉన్నాడు అని గుర్తింపు రావటంకోసం శాస్త్రమును ప్రమాణంగా తీసుకొని శాస్త్రములో చెప్పిన విషయాన్ని చేతనయినంతవరకు ఆచరించాలి. ఆచరించినది అనుభవంలోనికి వస్తుంది. సత్పురుషులతో, మహాత్ములతో సహవాసం చెయ్యాలి. ధ్యానం చెయ్యగా, విచారణ చెయ్యగా పూర్వజన్మలోపడ్డ ముద్రలు, దోషాలు ఒకదానితరువాత ఒకటి చిరిగిపోయి రాలిపోతాయి.

నీ అజ్ఞానానికి కారణం, ఈ సంసారచక్రంలో కొట్టుకొనిపోవటానికి కారణం నీ హృదయంలో గుణాలరూపంలో ఉంది. నీ గుణాలే నీకు శత్రువులు, నీ గుణాలే నీకు సంకెళ్ళు. మనలో తమోగుణం, రజోగుణం రూపంలో మాయ ఉంది. బాహ్యంగా ఎక్కడో లేదు. నిరంతరము భగవంతుని స్మరించటంవలన ఆయన తోటి మనకు మానసిక అనుబంధం ఏర్పడుతుంది. నా హృదయంలోనే దేవుడు ఉన్నాడు అని భావనచెయ్యి. నీ మనస్సుతోటి నీ హృదయంలో ఉన్న దేవుడిని నిరంతరము విరామంలేకుండా, విశ్రాంతి లేకుండా పూజచెయ్యటానికి అలవాటుచేసుకో. అలా అలవాటుచేసుకొంటే నీ హృదయంలోఉన్న మరకలు అన్నీ చెరిగిపోతాయి అంటున్నారు ఆచార్యులవారు. దీనినే మానసికపూజ అంటారు. నిజమైనదేవుడు నీహృదయంలోనే ఉన్నాడు. బయటఉన్న దేవుళ్ళు అందరూ నీ దేహం ఎంత నిజమో వారుకూడా అంతే నిజం. నీ హృదయంలో ఉన్న దేవుడు ఎటువంటివాడు అంటే నీదేహం పుట్టినపుడు వాడు పుట్టలేదు. చనిపోయినపుడు వాడు చనిపోడు. నీ ఉపాధితో సంబంధంలేకుండా సర్వకాల సర్వావస్థలలో ప్రకాశిస్తున్న దేవుడు నీ హృదయంలోనే ఉన్నాడుఅన్నసంగతి నీకు ఏ జన్మకి తెలుస్తుంది అంటున్నారు ఆచార్యులవారు. మన మనస్సు నిజంకాదు కాబట్టి నిజమైనదేవుడిదగ్గరకు వెళ్ళమంటే అది వెళ్ళదు. ఎందుచేతనంటే నిజమైనదేవుడిదగ్గరకు వెళితే ఈ మనస్సును మ్రింగేస్తాడని దానికి భయం. గుడిలో దేవునిదగ్గరకు వెళ్ళమంటే అది వెళుతుంది.

శరీరం ఉండగానే సాధనచేసి పునర్జన్మకు సంబంధించిన హేతువులను తొలగించుకొంటే మీరు జన్మలేని స్థితికి ఎదుగుతారు. అప్పుడు సుఖస్వరూపమును పొందుతారు. పూర్వజన్మలో నీవుచేసిన కర్మనుబట్టి ఈ దేహం ఇచ్చాడు. ప్రారబ్ధాన్ని చిరాకులేకుండా, విసుగులేకుండా, కోపంలేకుండా సంతోషంగా అనుభవించు. అలా అనుభవిస్తే ఆ ప్రారబ్ధం నశిస్తుంది, కొత్తవాసనలు రావు అంటున్నారు. ప్రారబ్ధం ఉందికాబట్టి దేహం వచ్చింది. ప్రారబ్ధం లేకపోతే దేహంరాదు. ప్రారబ్ధాన్ని enjoy చెయ్యి. ఏకాంతవాసమును enjoy చెయ్యి. ఆముదం నోటిలోపోసుకొన్నట్లుగాకాకుండా మామిడిపండు తిన్నప్పుడు ఎలా ఉంటావో అలా నీ ప్రారబ్ధాన్ని అనుభవించు. ప్రారబ్ధాన్ని సంతోషంగా అనుభవించగలిగితే పునర్జన్మకు కారణాలు ఆరోజుకారోజు తగ్గుతూ ఉంటాయి. నీకు ఎంత ఆనందం కావాలంటే అంత ఆనందము నీ హృదయంలో ఉంది. నీవు శ్రద్ధగా Subjectను శ్రవణంచెయ్యి, మననం చెయ్యి, ధ్యానంచెయ్యి అప్పుడు నీ హృదయంలోఉన్న ఆనందసముద్రము పొంగి నీ సహస్రారమును ముంచుతుంది.

భగవంతుడు ఎంత నిశ్శబ్దంగా పనిచేస్తున్నాడో అంత నిశ్శబ్దంగా పనిచేసుకొని వెళ్ళిపో. అలా నీకు పనిచేయటం చేతకాకపోతే నేర్చుకో అంటున్నారు ఆచార్యులవారు. ఈ సంఘటన ఇలా జరుగుతోంది ఏమిటి అని నీవు అనుకొంటావు. ఈ జన్మలో మన జీవితంలో ఏదైనా సంఘటన జరుగుతూ ఉంటే దానికి పూర్వజన్మకు ఏదో సంబంధం ఉంటుంది. మన జీవితాలు ఇలా రూపుదిద్దుకున్నాయి అంటే దానికి పూర్వజన్మలే కారణము. దానికి పరిణామంగా ఈ సంఘటనలు జరుగుతున్నాయి. ఈ ప్రారబ్ధాన్ని ఏడుస్తూ అనుభవించకుండా నీవు సంతోషంగా అనుభవిస్తే భవిష్యత్ జన్మలు ఉత్తమ జన్మలు రావటానికి పునాదులు ఏర్పడతాయి.

అహంభావనను ఒకప్రక్కకుపెట్టి భగవదనుభవం పొందటానికి ప్రయత్నంచెయ్యి. అహంభావనను తొలగించుకోవటానికి ఎప్పుడైతే ప్రయత్నంచేస్తున్నావో అహంభావన తాలూక వికారములు తగ్గిపోతాయి. ఏమిటి నా జీవితం ఇలా ఉంది అని నీవు బాధపడుతున్నావు నీ జీవితానికి నీ పూర్వజన్మలే కారణం. ఇవి రిపీట్ అవ్వకుండా ఉత్తమజన్మలు రావటానికి సత్కర్మను ఆచరించు. సత్కర్మను ఆచరించేటప్పుడు నిర్మలంగా చెయ్యి, నిరహంకారముగాచెయ్యి, నిశ్శబ్దంగా చెయ్యి. గొప్పలుచెప్పుకోవద్దు. నీ శరీరమే నీకూడా రానపుడు నీ గొప్పలు నీకూడా ఎలా వస్తాయి. గొప్పలు చెప్పుకోవటంవలన ఆరోజుకారోజు అజ్ఞానంలో కూరుకుపోతావు. గొప్పలవలన తిప్పలు వస్తాయి, జ్ఞానంమటుకు రాదు. పూర్వజన్మలనుండి వచ్చిన వాసనలు నీ హృదయంలో ఏమైనా ఉంటే వాటిని cut చేయటానికి ప్రయత్నించు, అలా ప్రయత్నంచేస్తూఉంటే రాబోయే జన్మలు ఉత్తమజన్మలు వస్తాయి.

కోరికలు నెరవేరనపుడు దుఃఖం వస్తుంది, కోపం వస్తుంది. ఆ కోపంవలన మిగతా వికారములు వస్తాయి. ఆలోచనే ప్రధానంగా పెట్టుకోండి. ఉద్రేకానికి గురికావద్దు. కోరికలు నెరవేరినా, నెరవేరకపోయినా సమానంగా ఉంటే కోపానికి దూరం అవ్వవచ్చును. మాటమాటకు కోపంతెచ్చుకోవద్దు. కోపాలు శాపాలు. మీకు మాటమాటకు కోపం వస్తూఉంటే మీకు శాపం ఉందిఅన్నమాట. అందులోనుండి నీవు బయటపడటానికి నీవు ప్రయత్నంచెయ్యి. (మీకు కోపం వస్తే వెంటనే దానిని మీరు కంట్రోలు చేసుకోలేకపోతే వాయిదా వేయండి. అప్పుడు దానివేగం తగ్గుతుంది అంటున్నారు ఆచార్యులవారు.) ఏదోరకంగా ఆ దోషాలనుండి బయటకు తీసుకొనిరావటానికి, మిమ్మల్ని తరింపచేయటానికి స్వాములవారుపడే తపనఇది. క్షమను ప్రాక్టీసుచేస్తే నీవు ఉద్రేకాన్ని జయించగలవు. (భగవంతుడు అంతటా సమానంగా వ్యాపించి ఉన్నాడు. భగవంతుడు ఎలా సమానంగా ఉన్నాడో అటువంటి సమానబుద్ధిని నీవు సంపాదిస్తే నీకు సాయుజ్యమోక్షం వస్తుంది అంటున్నారు ఆచార్యులవారు. సాయుజ్యమోక్షంఅంటే భగవంతునిలో ఐక్యమవుతావు.)

కొంతమందికి వారి అహంకారమునకు నీరుపోసుకోవటం, అది చనిపోకుండా చూసుకోవటంతప్ప వేరేపనిఏమీ ఉండదు. వారు మాట్లాడే మాటలో, వారికి వచ్చే తలంపులో, వారు చేసే పనిలో అహంకారము ఉంటుంది. అహంకారమును బ్రతికించుకోవటంకోసం జీవితంపొడుగునా ప్రయత్నంచేస్తారుగాని దానిని తొలగించుకోవటానికి ఏమీ ప్రయత్నంచేయరు. చిల్లరగొడవలు వదిలివెయ్యండి. వదలకపోతే final stateను పొందలేరు. నీచేతిలోఉన్న ఇత్తడిని వదలకపోతే నీ హృదయంలోఉన్న బంగారము దొరకదు. నీ హృదయంలోఉన్న బంగారంలాంటి సుఖాన్ని పట్టుకోవటంకోసం బాహ్యమైన గొడవలనువదలివెయ్యండి. ఉపయోగంలేని మాటలు, పనులు, ఆలోచనలు వద్దు. నిశ్శబ్దాన్ని ప్రాక్టీసుచెయ్యండి. చాలాపేచీలకు నాలుకే కారణము అందువలన నాలుకను కంట్రోలుచేసుకోండి. మీకు ఏమైనా చెడుస్నేహాలు ఉంటే వాటిని వదలివేసి మంచిస్నేహాలు చేయండి. మంచిస్నేహాలు చేయటంవలన ముందు చెడుస్నేహాలకు దూరమవుతాము. తరువాత మంచి స్నేహాలనుకూడా వదిలివేసి ఏకాంతవాసమును enjoy చేయవచ్చు.

(మీరు ఏది మాట్లాడినా మృదువుగా ఉండాలి, నెమ్మదిగా ఉండాలి, హితవుగా ఉండాలి. విషయాన్ని ఎదుటివారికి అర్థమయ్యేలాగ స్పష్టంగా చెప్పండి. మీరు మాట్లాడేమాటలు తియ్యగా ఉండాలి. కఠినంగా మాట్లాడవద్దు అని ఆచార్యులవారు చెపుతున్నారు. ఇతరులపట్ల మీ ప్రవర్తన నాగరికంగా ఉండాలి, మర్యాదపూర్వకంగా ఉండాలి. మీ ప్రవర్తన అనాగరికంగా ఉంటే కొత్తవాసనలు ఏర్పడతాయి. మనస్సు అంతా దుమ్ముతో నిండిపోతుంది.)

ఎదుటివారు ఉద్రేకంగా మాట్లాడినా మీ మానసిక క్రమశిక్షణను విడిచిపెట్టవద్దు. మీకు ఎంతధనం ఉన్నా, ఎంత అధికారంఉన్నా, ఎంత విద్య ఉన్నా మానసిక క్రమశిక్షణ లేకపోతే మీరు సుఖపడరు, మీకు శాంతిలేదు. మానసిక క్రమశిక్షణ చాలా ముఖ్యం. మిమ్మల్ని ఎవరైనా ఉద్రేకపరిస్తే, ఇబ్బందిపెడితే రాముడియొక్క రూపాన్ని,

నామాన్ని ధ్యానంచేసుకోండి అప్పుడు మీ మనస్సు చల్లబడుతుంది. ఆయన క్షమాస్వరూపుడు.

ఆహారవిషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఆహారం తినేటప్పుడు నీ శరీరం చెప్పినట్లు విను. నీ మనస్సు చెప్పినట్లు వినకూడదు. ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉంటే రోగాలకు దూరంగా ఉండవచ్చు, నీ మనస్సు నిర్మలంగా ఉంటుంది. శరీరంయొక్క ప్రభావం మనస్సుమీద ఎక్కువగా ఉంటుంది. నీ శరీరమును, మనస్సును ఆరోగ్యముగా ఉంచుకొని నీ కాలమును సద్వినియోగంచేసుకొంటే నీకు బ్రహ్మానుభవం ఇక్కడే చిక్కుతుంది. శారీరకఆరోగ్యము, మానసికఆరోగ్యము బాగా ఉండాలంటే ఆహారనియమం ఉండాలి. రుచిగా ఉన్నా సమానంగా తినాలి. అన్ని నియమాలలోకి ఆహారనియమము చాలా ముఖ్యమైనది అని భగవాన్ చెప్పారు.

బాహ్యవిషయాలవలన సంతోషం వస్తుంది అనుకోండి ఆ సంతోషం ఏనాటికైనా విషంగా మారుతుంది అని జ్ఞాపకంపెట్టుకోండి. ఇది ప్రమాదంఅని చెపుతున్నారు. నీవు దుర్యోధనుడికంటే, రావణాసురుడికంటే గొప్పవాడివి ఏమీకాదు. నీవు దుర్వాసనలు పెంచుకొంటే ధుర్యోధనుడికి, రావణాసురుడికి ఏగతిపట్టిందో మనకికూడా అదేగతిపడుతుంది. అందువలన వారినికూడా తలపెట్టుకోవాలి. వారు ఏ గుణాలవలన పతనమయ్యారో ఆగుణాలు మనలో ఉంటే మనంకూడా అలా పతనమవుతాము అనే విషయం మనకి తెలియటంకోసం వారిని జ్ఞాపకంపెట్టుకోమని చెపుతున్నారు.

(జీవుడు వేరు, దేహం వేరు. ఇవి రెండూ కలగాపులగం చేసుకోవద్దు. దేహం పుడుతుంది, పెరుగుతుంది, మరణిస్తుంది. జీవుడు బ్రహ్మంలో ఐక్యమయ్యేవరకూ దేహాలు తొడుక్కొంటూనే ఉంటాడు. జీవుడు, దేహం ఒకటే అనుకొంటే మీకు బుద్ధిలేదు, వివేకం లేదు అంటున్నారు ఆచార్యులవారు. భౌతికమైన అగ్నివలన దేహం కాలిపోతుంది. జ్ఞానాగ్నివలన జీవుడు కాలిపోతాడు. ఎంతసేపు దేహంగురించి ఆలోచిస్తున్నారుగాని జీవుడు ఎంతవరకూ బాగుపడ్డాడు, ఎంతవరకు పవిత్రుడు అయ్యాడు, బ్రహ్మానుభవం పొందటానికి యోగ్యత సంపాదించాడా అని జీవుడు గురించి ఎప్పుడైనా మీవేగం తగ్గించుకొని నిలబడి ఆలోచించారా అని అడుగుతున్నారు.) గురువు తప్పించి, జ్ఞాని తప్పించి ఇంతవివరంగా మీరు బాగుపడాలిఅనే తపనతో చెప్పేవారు ఎవరు ఉంటారు. మీరు పుట్టింటికి వెళ్ళారు అనుకోండి. రెండు రోజులు అన్నంపెడతారు, రెండు చీరలు పెడతారు, వందరూపాయలు ఇస్తారు వెళ్ళిరండి అంటారు. అంతేగాని మీకు జ్ఞానంగురించి ఎవరు చెపుతారు.

సంసారరోగం దీర్ఘరోగం. నీ హృదయంలోఉన్న బ్రహ్మమును ధ్యానంచేయటంవలన సంసారరోగం తగ్గుతుంది. ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదు. ఈ వస్తువులనుచూసి నీవు మోహపడవద్దు. (నీవు డబ్బును, గౌరవాన్ని ఎలా సంపాదించుకొంటున్నావో అలాగ వైరాగ్యమును సంపాదించుకోవాలి. అదే నిజమైన సంపద. నీ హృదయంలో ములగాలంటే వైరాగ్యమును అలవర్చుకోవాలి. ఈ లౌకిక మానవులకు వైరాగ్యసుఖంగురించి ఏమి తెలుస్తుంది అన్నారు ఆచార్యులవారు. వైరాగ్యమును అభివృద్ధిచేసుకో వైరాగ్యం లేకపోతే జ్ఞానమును సంపాదించాలి అనే కాంక్షకూడా నీకు కలుగదు. వైరాగ్యం ఉంటే సహృదయం వస్తుంది. అప్పుడు నీ హృదయంలో ఉన్న ఈశ్వరుడు నీకు వ్యక్తమవుతాడు.) స్నేహాలవిషయంలో అతిగా ఉండవద్దు. దానివలన మత్తు వస్తుంది.

కొంతమందికి క్రూరత్వం సహజంగా ఉంటుంది. ఎదుటివారు బాధపడుతూ ఉంటే వారికి పాయసం త్రాగినట్లుగా ఉంటుంది. ఎదుటివారి బాధనుచూసి సంతోషిస్తారు. ఇటువంటిబుద్ధి మీకు ఉంటే దయను, కరుణను, ప్రేమను ప్రాక్టీసుచేసి క్రూరత్వమును తొలగించుకోండి. కొంతమంది softగాను, sweetగాను మాట్లాడరు. ఇలా మాట్లాడాలంటే ఏమీ పెట్టుబడిలేదుకదా. అయినా అలా మాట్లాడరు ఎందుకంటే వారిస్వభావంలో క్రూరత్వం ఉంటుంది. అటువంటి క్రూరత్వం పోవాలంటే ప్రేమను, దయను ప్రాక్టీసు చెయ్యండి.

మోక్షానుభవం కలగటానికి స్వప్రయత్నము, దైవానుగ్రహం రెండూ అవసరం అని చెపుతున్నారు. ప్రయత్నం ఉందికదా దేవునిఅనుగ్రహం అవసరములేదు, దేవునిఅనుగ్రహం ఉందికదా ప్రయత్నం అవసరములేదు అనుకోవద్దు. ప్రయత్నం ప్రయత్నమే, దేవుని అనుగ్రహం దేవునిఅనుగ్రహమే. దేవునిఅనుగ్రహాన్ని తీసుకొనివచ్చి ప్రయత్నంలో పెట్టకూడదు. ప్రయత్నాన్ని తీసుకొనివెళ్ళి దేవునిఅనుగ్రహంలో పెట్టకూడదు. ఈ రెండింటిని కలగాపులగం చేయవద్దు. ఇందులో ఒకటి ఎక్కువ, ఒకటి తక్కువ కాదు. మీకు కుడికన్ను కావాలా, ఎడమకన్ను కావాలా అంటే ఏమిచెపుతారు. రెండూ కావాలి అంటారు. అలాగే ఈ రెండింటిని సమానంగా చూసుకొంటూ తరించు.

చిల్లరగొడవలలోనికి వెళ్ళవద్దు. ఉద్రేకపడకుండా ప్రశాంతముగా, ఏకాంతముగా కూర్చొని ముందు నీ హృదయంలో ఏ దుర్వాసనలు ఉన్నాయో జాగ్రత్తగా పరిశీలనచేసుకో. కొంతమంది ఎదుటివారిలో ఏ దుర్గుణాలు ఉన్నాయో కనిపెట్టటానికి కాలమును వృధా చేస్తారు. దీనివలన నీకు ఏమీ కలిసిరాదు. నీలో ఏ దుర్గుణాలు ఉన్నాయో తెలుసుకొని వానిని తొలగించుకోవటానికి ప్రయత్నంచెయ్యి. అదే సాధన. నీవుచేసేపని నిర్మలంగా చెయ్యి, నిదానంగా చెయ్యి. ఎప్పుడైతే నీలోఉన్న దుర్గుణాలను తొలగించుకోవటానికి ప్రయత్నం మొదలుపెట్టావో దేవుని అనుగ్రహం వస్తుంది. దీని సహాయంతోటి, దాని సహాయంతోటి ఆ దుర్గుణాలనుండి బయటపడతావు. అప్పుడు మోక్షానికి అర్హత, యోగ్యత సంపాదిస్తావు. ఇతరులను అసహ్యించుకోవద్దు. నీ హృదయంలో ఉన్నవాడే అక్కడా ఉన్నాడు. పెద్దపనులు అందరూ శ్రద్ధగా చేస్తారు. చిన్నపనులుకూడా శ్రద్ధగా చేయటం నేర్చుకో అంటున్నారు ఆచార్యులవారు. చిన్నపనులుకూడా శ్రద్ధగా, భక్తిగా చేస్తే నీమనస్సు బాగుపడుతుంది. రాబోయే ప్రమాదములనుండి బయటపడతావు.

ఆత్మవిద్యని, ఆత్మజ్ఞానాన్ని సంపాదించుకోవటానికి ప్రయత్నంచెయ్యి. ఈలోకంలో అనేకవిద్యలు ఉన్నాయి. ఆత్మవిద్యను నేనే అని భగవంతుడు చెప్పాడు. ఆత్మవిద్యద్వారా ఆత్మ తెలియబడుతుంది. మిగతా విద్యలుఅన్నీ పొట్టకే పరిమితం ఒక్క ఆత్మవిద్యవలననే ఆత్మ తెలియబడుతుంది. అందువలన ఆత్మవిద్యను సంపాదించుకోవటానికి ప్రయత్నంచెయ్యి. భౌతికవిద్యలు సంపాదించాలంటే కొంత తెలివి అవసరము. భగవంతునిమీద భక్తిఉంటే నీకు ఆత్మవిద్య వచ్చేస్తుంది. దీనికి పెద్దతెలివి అక్కరలేదు, సామాన్యమైన తెలివితేటలు సరిపోతాయి అని చెపుతున్నారు. భగవంతుడుఉన్నాడనే విశ్వాసం నీకు ఉంటే సరిపోతుంది. అప్పుడు నీమనస్సువెళ్ళి భగవంతునిలో ఐక్యమయిపోతుంది. అప్పుడు ఉన్నది మిగిలేది ఆత్మజ్ఞానమే.

అరణ్యం అంటుకొంది అనుకోండి. అందులోఉన్నజంతువులు కంగారుపడి మంటలలోనుండి తప్పుకోవటానికి పరుగులుపెట్టి వెళ్ళి ఆమంటలలో పడిపోతాయి. మన బ్రతుకులుకూడా అలాగే ఉన్నాయి అంటున్నారు. మోక్షమార్గము మనకు తెలియటంలేదు. కంగారుపడి పునర్జన్మకు కారణమైనవాటిలో పడిపోతున్నాము. విచారణచేసుకొనే శక్తిలేక కంగారుపడి పునర్జన్మలకు వెళుతున్నాము.

నీ హృదయంలో నారాయణుడు ఉన్నాడు. వాడిగురించి ఆలోచించు, వాడిగురించి ధ్యానించు, వాడిగురించి విచారణచెయ్యి. వ్యర్థమైన పనులతో, వ్యర్థమైన చింతలతో కొట్టుకొనిపోయేకంటే నీ హృదయంలోఉన్న పరమేశ్వరునిగురించి కొంచెం ఆలోచించటం నేర్చుకో. నీ హృదయంలో ఉన్న పరమేశ్వరునిగురించి ఆలోచించకపోతే నీవు ఆరోజుకారోజు మొద్దబ్బాయివి అయిపోతావు. జడత్వం వస్తుంది. ఆరోజుకారోజు నీ వివేకం పెరగాలిగాని మొద్దబ్బాయివి అవ్వకూడదు. ఆత్మవిద్యకానివి అన్నీ మంటలోపెట్టిన కట్టెలవంటివి. మిగిలిన విద్యలు అన్నీ కాలప్రవాహములో కొట్టుకొనిపోతాయి. నీకు విద్య ఉన్నా, ధనం ఉన్నా అవిచూసి గర్వపడవద్దు. కాలప్రవాహములో. పెద్దపెద్ద సామ్రాజ్యములే అంతరించిపోయాయి. గర్వపడే వస్తువు ఈసృష్టిలో ఏదీలేదు. అన్నీ కాలప్రవాహములో కొట్టుకొనిపోతాయి.

నీకు ఎంతకాలానికి ఈ మానవజన్మ వచ్చిందో? ఈ దేహాన్ని పాడుచేసుకోవద్దు. చిల్లర విషయాలకు నీ జీవితాన్ని పాడుచేసుకోవద్దు. మానవజన్మను వృధాచేసుకోవద్దు. ఈ అవకాశమును విడిచిపెట్టుకొంటే మరల ఇది నీకు వస్తుందో, రాదో చెప్పలేము. ఎంతపుణ్యం చేసుకొంటే, భగవంతుని ప్రీతికోసం ఎన్నిపనులు చేస్తే ఈమానవ జన్మ వచ్చిందో. అందువలన ఈ మానవజన్మను వృధాచేసుకోవద్దు. నీకు మానవజన్మ వచ్చింది. చేతిలోఉన్న అవకాశమును విడిచిపెట్టుకోవద్దు. మీ ఇంటికి ఎవరైనావస్తే ఇంటిలోఉన్న రూపాయలను పొయ్యిలోపెట్టి వారికి కాఫీ కాచి ఇస్తారా? అలాచేయరు. అదేవిధంగా ఈ మానవజన్మను చిల్లరవిషయాలకు ఖర్చుపెట్టవద్దు. లక్ష్మిఅంటే నీకు కనబడే రూపాయలు కాదు. నిజమైన లక్ష్మి మోక్షంలోనే ఉంది. అది నాశనంకాని లక్ష్మి. ఆ మోక్షలక్ష్మిని పొందటంకోసం నీ మనస్సును, ఇంద్రియాలను, దేహాన్ని అదుపులోపెట్టుకో. నీమనస్సు, ఇంద్రియాలు, దేహం నీ స్వాధీనంలో ఉంటే నీకు మోక్షసుఖం అందుతుంది. అందువలన వీటిని కంట్రోలుచేసుకోవటానికి ప్రయత్నంచెయ్యి.

(నీవు మొద్దబ్బాయిలాగ ఉండవద్దు. నేను ఏదైనా 4 మాటలు చెపితే అవి హేతుబద్ధంగా ఉన్నాయా, లేదా అని చూసుకో. నీ బుద్ధితో ఆలోచించుకో. నేను చెప్పినమాటలు మీస్వంతం అవ్వవు. మీ బుద్ధితో ఆలోచించుకొన్నవి మీస్వంతం అవుతాయి. విన్నమాటలు అర్థంచేసుకోవటానికి శక్తివంచన లేకుండా ప్రయత్నంచేయండి. మీచైతన్యస్థాయిని పెంచుకోండి. ఇలా ఆచార్యులవారు కొన్నిమాటలు చెప్పి ఈ మాటలు నాతెలివివలన, నాప్రజ్ఞవలన, నా పాండిత్యంవలన ఏమీ చెప్పటంలేదు. దక్షిణామూర్తి అనుగ్రహంవలన చెపుతున్నాను. ఆయన అనుగ్రహంలేకపోతే నేను ఈ మాటలు చెప్పలేను అంటున్నారు ఆచార్యులవారు. శంకరాచార్యులవారు సర్వజ్ఞుడు. దక్షిణామూర్తి అనుగ్రహంలేకపోతే నేనెంతటివాడిని ఈ మాటలు మీకు చెప్పటానికి అని ఆయన అంటున్నారు. ఆయనే ఇలా అంటూఉంటే దేనినిచూసి మనం పొగరుబోతుతనానికి గురిఅవుతున్నాము. దక్షిణామూర్తి ఆశీస్సులు నానెత్తిమీద ఉన్నాయికాబట్టి నేను ఈ మాటలు చెప్పగలుగుతున్నాను అంటున్నారు ఆచార్యులవారు. మన నెత్తిమీద శనిగాడు ఉన్నాడు. అందువలన మనం ఇలా తయారయ్యాము. ఆచార్యులవారినెత్తిమీద దక్షిణామూర్తి అనుగ్రహంఉంది అందుచేత ఆయన ఈ మాటలు చెప్పగలుగుతున్నాడట. ఇందులో నా ప్రయోజకత్వం ఏమీలేదు అంటున్నారు ఆచార్యులవారు.)

ఇంతవరకు నేను చెప్పినమాటలు మీరు అవగాహనచేసుకొంటే అజ్ఞానము అనే నిద్రలోనుండి మేల్కోవటానికి ఈమాటలు మీకు ఉపయోగపడతాయి అంటున్నారు ఆచార్యులవారు. ఇంటికివెళ్ళి ఈమాటలను మననంచేయండి, ఈమాటలను ధ్యానంచేయండి. ఈ మాటలు బాగా అర్థమయితే మోక్షమునకు వెళ్ళటానికి దారికనిపిస్తుంది. ఈ మాటలు మీకు properగా అర్థమయితే నీలో పునర్జన్మకు హేతువులు అయిన ముద్రలుఅన్నీ బయటకు వస్తాయి. ఈమాటలు surgery చేసి మీలోని చెడును, దుర్వాసనలను బయటకు లాగేస్తాయి. నీలోఉన్న వాసనలను ఈ మాటలు కత్తిరిస్తాయి. ఎప్పుడైతే వాసనాక్షయం అయ్యిందో అప్పుడు నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది.

మనిషిలో 3 దోషములు ఉంటాయి. (1) మలదోషము (2) విక్షేపదోషము (3) ఆవరణదోషము. కేవలము దేహాన్ని దృష్టిలోపెట్టుకొని చేసే పనులుఅన్నీ మలదోషంక్రింద మారతాయి. సత్కర్మను ఆచరించి కర్మఫలాన్ని త్యాగంచేస్తే మలదోషం పోతుంది. అంటే కర్మయోగమువలన ఈదోషం నశిస్తుంది. పూజచేసాము, గుడికి వెళ్ళాము మనస్సు దేవునిమీద నిలబడటంలేదు అంటారు. అది విక్షేపదోషం. భక్తివలన ఈ దోషం పోతుంది. అంటే భక్తియోగమువలన ఈదోషం నశిస్తుంది. ఆవరణ అంటే దొడ్డి. మన సంసారం మనకి బందులదొడ్డి. బందులదొడ్డిలో దూడలు ఉన్నట్లుగా మనం ఈ సంసారంలోపడి ఉంటున్నాము. నువ్వు ఎవరో నీవు తెలుసుకోవటంవలన ఈదోషం నశిస్తుంది. జ్ఞానయోగంవలన ఇది నశిస్తుంది.